www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 జూన్ 2024

5





సిఎం ప్రమాణస్వీకార మహోత్సవం

ప్రత్యక్ష ప్రసారం : కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12వ తేదీ ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుండి ఔత్సాహికులైన ప్రజలను నియోజకవర్గానికి నాలుగు బస్సుల ఏర్పాటుతో సదరు ప్రమాణ స్వీకార మహోత్సవ విజయవాడ సభకు మోబిలైజ్ చేయాలని, ప్రత్యక్ష ప్రసార వీక్షణకు పండుగ వాతావరణంలో ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార మహోత్సవానికి చేపట్టాల్సిన పలు అంశాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీక్షించి ఆర్డీఓలు, డివిజన్, నియోజక వర్గ, మునిసిపల్, మండల తహశీల్దార్, ఎంపిడిఓ, మునిసిపల్ కమిషనర్, తదితర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి బస్సుకు ఒక నోడల్ అధికారి ఏర్పాటుతో బాధ్యతగా వారిని మంగళవారం ఉదయం తీసుకుని బయల్దేరి సాయంత్రం 5 గంటలకు సూచించిన ట్రాన్సిట్ పాయింట్ వద్ద వెళ్ళాలని రాత్రి బస ఏర్పాటు ఉంటుందన్నారు. అనంతరం మరుసటి రోజు బుధవారం సిఎం ప్రమాణ స్వీకార సభాప్రాంగణానికి వారిని తీసుకువెళ్లి జాగ్రత్తగా వారిని తిరిగి తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. తాగునీరు తదితర ఏర్పాట్లు సదరు నోడల్ అధికారి బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. బస్సుకు ఫ్లెక్సీ ఏర్పాటు ఉండాలని తెలిపారు. సోమవారం నుండి 12వ తేదీ వరకు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, జిల్లా, నియోజక వర్గ, డివిజనల్, మండల ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ విద్యుత్ కాంతుల లైటింగ్ ఏర్పాటుతో పండుగ వాతావరణం ఉండాలని తెలిపారు. అంతే కాకుండా ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ప్రజలు వీక్షించేలా మండల స్థాయిలో మండల పరిషత్ మీటింగ్ హాల్‌లలో, కమ్యూనిటీ హాల్, నియోజక వర్గాల్లో గుర్తించిన పెద్ద హాల్ లేదా కళ్యాణ మంటపం, మున్సిపల్ హాల్ తదితర వాటిలో ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ,వార్డు స్థాయిలో కమ్యూనిటీ హాల్ వంటి వాటిలో ప్రజలు ప్రత్యక్ష ప్రసారం వీక్షించే విధంగా టీవీ, ఇంటర్నెట్, డిష్ ఏర్పాటు ఉండాలని సూచించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో కార్యక్రమం కచ్చపి ఆడిటోరియంలో ఏర్పాటు ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పిడి లు డ్వామా శ్రీనివాస ప్రసాద్, డిఆర్‌డిఎ ప్రభావతి, మెప్మా రాధమ్మ, డిప్యూటీ సిఈఓ ఆదిశేషారెడ్డి, డిఎల్‌డిఓ సుశీల దేవి, డిటి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి రివార్డులు

మహిళ పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఎస్‌పి సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బందితో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ప్రతి పోలీస్ అధికారులు, సిబ్బందిని పేరుపేరునా ఎస్పీ పలకరించి, ప్రస్తుతం మహిళల రక్షణ కోసం తిరుపతి నగరంలో అమలు చేస్తున్న మహిళా రక్షక్, పెట్రోలింగ్ వివరాలను గురించి తెలుసుకొని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన ప్రణాళికను గురించి దిశా నిర్దేశం చేశారు. మహిళల సమస్యలు, సైబర్ నేరాలు గురించి మహిళలకు అవగాహన కలిగించి, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో కూడా నిఘా ఉంచాలని, మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి వారు చేసిన మంచి పనిని, గుర్తించి వారికి రివార్డ్ ఇవ్వాలన్నారు. గత సంవత్సరం రోజులుగా ఎవరైనా అసాధారణ మంచి పనిచేసి ఉంటే తగిన ప్రోత్సాహకాలు (రివార్డులు) ఇవ్వడం ద్వారా పోలీసులను మానసికంగా ఉత్తేజపరిచినట్లు అవుతుందని అన్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడేటప్పుడు చాలా మర్యాదగా మాట్లాడాలని, మహిళా సమస్యలు చాలా భిన్నమైనవిగా వస్తుంటాయని, మీరు శిక్షణ పొంది వచ్చారు కనుక సమస్యను పరిష్కరించే దిశగా వారితో మాట్లాడాలని, ఎవరితో కూడా తప్పుగా ప్రవర్తించకూడదని, మాట్లాడకూడదని సూచించారు. తిరుపతి టెంపుల్ టౌన్ అని, తిరుపతిలో కాలేజీలు, యూనివర్సిటీలు ఉన్నందున అవగాహన కార్యక్రమాలు చేపట్టి, మంచి ఫలితాలు తీసుకురావాలని, అదే సమయంలో పోలీసులు తమ జీవితాలను సమస్యలు భారి నుండి కాపాడుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే నేరుగా తనకు గానీ, అదనపు ఎస్పీలు అడ్మిన్‌కి గానీ, క్రైమ్‌కి గానీ తెలియపరిస్తే సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి, డిఎస్పీలు వెంకటాద్రి ఎస్బి, రమణ కుమార్ ట్రాఫిక్, సీఐ శరత్‌కుమార్, మహిళాపోలీసులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రేపు ధర్మకర్తల మండలి రాజీనామా

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, మండలి సభ్యులు అందరూ ఈనెల 12వ తేదీ ఉదయం 10గంటకు రాజీనామా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మండలి సభ్యులకు సమాచారం పంపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రజాతీర్పును గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనివాసులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారని ఒక దశలో ప్రచారం జరిగింది. ఇదంతా వాస్తవం కాదని ఆయన తేల్చేశారు. ధర్మకర్తల మండలి వారు తమ రాజీనామాను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావుకు అందజేయనున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పురప్రజలకు, యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక దృష్టి పెడతామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం నగరంలో ముఖ్యమైన కూడళ్ళు, ట్రాఫిక్ పాయింట్ల వద్ద తనిఖీలు చేసి విధులలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు కార్యాచరణ దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ నగరంలోని ప్రధాన కూడళ్ళు అయిన లీలామహల్ సర్కిల్, పూర్ణకుంభం సర్కిల్, గరుడ సర్కిల్, ప్రైవేట్ బస్సులు పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రస్తుతం నగరంలో అనుసరిస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతూ ప్రస్తుత ప్రణాళికకు కొన్ని సవరణలు చేసి సరి కొత్త ప్రణాళికను దిశ నిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ వెంకట్రావు పరిపాలన, తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమణ కుమార్, విధులలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

13 నుంచి నాబార్డు ఎఫ్‌టిఓ మేళా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 13 నుండి 15వ తేదీ వరకు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యంలో ఎఫ్‌పిఓ మేళా నిర్వహిస్తున్నట్లు నాబార్డ్ డిడి సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాను తరంగ్ కార్యక్రమాన్ని స్మాల్ ఫార్మర్స్ అగ్రి - బిజినెస్ కన్సార్టి ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ వారి భాగస్వామ్యంతో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ మేళాలో గోఆధారిత వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులు, రైతులు సేంద్రీయ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన కూరగాయలు, పండ్లు, మినుములు, తేనె, బెల్లం వంటి సేంద్రియ ఉత్పత్తులను 50 స్టాల్స్ ఏర్పాటు ఉంటాయని తెలిపారు. అలాగే చేనేత కలంకారీ చీరలు, ఉత్పత్తులు, చెక్కతో చేసిన విగ్రహాలు, కుండలు ప్రదర్శింప బడుతాయని తద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు, కళాకారులకు ప్రోత్సహించడం, వారి ఆదాయమార్గాలు పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ మేళా ఈనెల 13న ప్రారంభమై 15వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తిరుపతి ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేళా దినాలలో ప్రతి రోజూ సాయంత్రం 5 గంట నుండి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నాబార్డ్ డిడి ఆ ప్రకటనలో తెలిపారు.

గృహవిజ్ఞాన శాస్త్రంలో సుజాతకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గృహవిజ్ఞాన శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి ఎస్.సుజాతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వియూ మాజీ రిజిస్ట్రార్, గృహవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు ఆర్కే అనురాధ మార్గదర్శకత్వంలో "డిటర్మినెంట్స్ ఆఫ్ అండర్ స్టాండింగ్ ద బేసిక్ మ్యాథ్ కాన్సెప్ట్స్ అండ్ మ్యాథమెటికల్ అచీవ్మెంట్ వన్ అండ్ టూ స్టాండర్డ్ చిల్డ్రన్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను సుజాతకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు తెలిపారు. ఎస్.సుజాత పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్‌లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. ఎస్.సుజాతకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

20 నుంచి పౌరాణిక నాటికల పోటీలు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా హనుమాన్ అవార్డ్స్ పౌరాణిక నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు బిఎన్.రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12 సాంఘిక నాటికలు, 9 పద్య నాటకాలను వివిధ ప్రాంతాలలో ఉన్న కళాకారులచే ప్రదర్శించబడతాయని అన్నారు. ఈ ప్రదర్శన కోసం రాష్ట్రవ్యాప్తంగా 57 సాంఘిక నాటికలకు, 32 పద్య నాటకములకు దరఖాస్తులు వచ్చాయన్నారు. పరిశీలన ఎంపికల తరువాత పరిమితంగా పద్య నాటకములు, సాంఘిక నాటికల కళాబృందాలను ప్రదర్శనలకు ఎంపిక చేసామన్నారు. మన జాతీయ సంపద కళలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో అభినయ ఆర్ట్స్ గడిచిన 23 సంవత్సరాలుగా నిర్విరామంగా పద్య సాంఘిక నాటికల ప్రదర్శనలు చేస్తోందన్నారు. కళలు మానవ జీవితంలో ముడిపడి ఎంతోమందికి జీవనోపాధిని కల్పిస్తోందని, అలాంటి కలలను నమ్ముకున్న వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణ రెడ్డి, విశ్వనాథరెడ్డి, శోభ, కోటేశ్వరరావు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఎన్.రెడ్డి

క్యాన్సర్ పై అవగాహన, శిక్షణా కార్యక్రమం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రుయా చిన్నపిల్లల హాస్పిటల్‌లో క్యాన్సర్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వైద్యఆరోగ్య శాఖధికారి డాక్టర్ యు.శ్రీహరి మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడకుండా ముందుగా తగిన జాగ్రత్తలు, పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిన్న వయస్సులోనే చాలామంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, గుట్కా వినియోగం వల్ల క్రమంగా క్యాన్సర్ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నాయన్నారు. రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ టాటా కాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో జిల్లాలోని కమ్యూనిటీ, ఏరియా హాస్పిటల్ వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం చేపట్టమన్నారు. ఈశిక్షణ సోమవారం నుండి మూడు రోజులపాటు జరుగుతుందని, దీనివల్ల గ్రామ స్థాయిలో ప్రజలకు కాన్సర్ నిర్ధారణ, చికిత్స త్వరగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీనివాస రావు, డాక్టర్ పద్మావతి, మాస్ మీడియా ఆఫీసర్ బాబు నెహ్రూరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ వెంకటలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ రోజా రమణి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సౌమ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను విధుల్లోకి తీసుకోవాలి: రాధాదేవి



ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుమల కళ్యాణకట్టలో అకారణంగా తొలగించిన తొమ్మిది మంది నాయీ బ్రాహ్మణులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టిటిడి ఉమెన్ బార్బర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాదేవి కోరారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయంలో తిరుమల కళ్యాణ కట్టను నాయకులు తమ సొంత జాగీరుగా మార్చుకొని అక్కడి సిబ్బందిని మనోవేదనకు గురిచేస్తూ ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. నాయీ బ్రాహ్మణులకు మంచి జరిగే రోజులు వచ్చాయని, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే నారా చంద్రబాబు నాయుడు నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తే రూ.25వేల గౌరవవేతనాన్ని ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. తిరుమలలో ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా కళ్యాణ కట్టలో పనిచేసే సిబ్బంది స్వతంత్రంగా విధులు నిర్వహించుకునే వాతావరణం కూటమి ప్రభుత్వం రావడంతో సాధ్యమైందన్నారు. కొంతమంది నాయకులు తిరుమలలో కళ్యాణకట్టలో జరుగుతున్న అన్యాయాలపై ఎప్పుడు స్పందించని ఇనుకొండ సుబ్రమణ్యం లాంటివారు కూడా ఇప్పుడు ఉన్నట్టుండి తెరపైకి వచ్చి నాయీ బ్రాహ్మణులను ఆదుకుంటామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

పోలీసు శునకంకు పదవీ విరమణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పట్టణంలోని డాగ్ స్క్వాడ్ విభాగం ఆవరణలో అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు ఆధ్వర్యంలో బిందు అనే పోలీస్ శునకం పదవీ విరమణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దాదాపు 11 సంవత్సరాలపాటు పోలీసు డిపార్టుమెంటుకు సేవలందించిన బిందు అనే పోలీసు శునకం సోమవారం పదవీ విరమణ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు పోలీసు శునకంకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధుల్లో బిందు చేసిన సేవలను కొనియాడారు. పలు కేసుల దర్యాప్తుల్లో తారా సహకారం మరువలేమని ప్రశంసించారు..

బిందు 22.1.2013 లో జన్మించింది. ఇది ల్యాబ్రడార్ జాతి శునకం (స్నిఫ్ఫెర్ డాగ్). బిందు విఐపి, వివిఐపి కార్యక్రమాలలో మెరుగైన సేవలు అందించింది. కాణిపాకం, తిరుమల బ్రహ్మోత్సవాలు సమయాలలో సంఘ విద్రోహచర్యల నివారణ కొరకు దీని సేవలు ఉపయోగించేవారు. పలు కీలకమైన కేసులలో దీని సహకారం ఉపయోగకరమైనది. అలానే పోలీసు విధులలో భాగమైన ఎన్నికలలో చురుగ్గా పాల్గొనింది. తన అనుగుణమైన శైలితో ఉన్నతమైన సేవలు పోలీసు డిపార్టుమెంటుకు అందించింది. పోలీస్ డ్యూటీ మీట్‌లో బిందు తన ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ కూడా సాధించింది. అనంతరం ఎస్పీ డాగ్‌స్క్వాడ్ విభాగంను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఏఆర్.నాగేశ్వర రావు, ఏఆర్ డిఎస్పి మహబూబ్ బాష, ఆర్ఐ సుధాకర్ హాజరయ్యారు.



పదవీ విరమణ చేసిన బిందును సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

మంగళంలో ఉద్రిక్తత

కుటుంబ కలహాలతో దాడులు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం):

మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ వసంతు అశోక్ కుమార్ రెడ్డి, ఆయన చిన్నాన్న లక్కిరెడ్డి మధ్య ఉన్న కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం మంగళంలో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో జరిగిన లావాదేవీలను లక్కిరెడ్డి సంబంధించిన వారు అశోక్ కుమార్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అడగడంతో ఈ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని స్థానిక సమాచారం. లక్కిరెడ్డి కుమారుడు పురుషోత్తం రెడ్డి, సుదర్శన్ రెడ్డితో కలిసి అశోక్ రెడ్డి ఇంటి వద్ద ఉన్న కారు అద్దాలు పగలగొట్టారని, తమ కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని అశోక్ కుమార్ రెడ్డి తిరుచానూరు పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో తిరుచానూరు పోలీసులు మంగళంకు చేరుకొని ఘటనకు గల కారణాలను ఆరా తీశారు. లక్కిరెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తున్నామని సిఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈఫిర్యాదుపై దర్యాప్తు కొనసాగుతుందని సీఐ శ్రీకాంత్ రెడ్డి చెప్పారు. ఈ దాడుల విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళం సప్తగిరి కాలనీకి చేరుకోవడంతో పోలీసులు సద్దిచెప్పి పంపేశారు. కాగా మళ్లీదాడులు పునరావృత్తం కాకుండా సాయుధ దళాలు మంగళంలో పహారా కాస్తున్నాయి. కాగా ఉప సర్పంచ్ అశోక్ కుమార్ రెడ్డి వైసీపీకి మద్దతుదారుడుగా ఉండడం, లక్కిరెడ్డి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేశారు. దీంతో జరుగుతున్న దాడులకు కుటుంబ కలహాల తంతుకు రాజకీయ రంగు పులుముకుంది.



పహారా కాస్తున్న సాయుధ బలగాలు

పాఠశాలకు బీరువా వితరణ


పాఠశాలకు బీరువాను వితరణ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ లోని ఆ సంస్థ కార్యాలయంలో సైదాపురం మండలంలోని మర్ల పూడి ఉన్నత పాఠశాలకి ఒక బీరువా, కూల్ వాటర్ క్యాన్‌ను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంతో తమ సంస్థ ద్వారా పట్టణ , పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. పోతిరెడ్డి పెంచలయ్య , సంచి మునిప్రసాద్‌ల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ చంద్రశేఖర్, చల్లా శ్రీనివాసులు, చల్లా మురళీ, ఉపాధ్యాయులు రమేష్, లక్ష్మీదేవి, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, శ్రీ చైతన్య స్కూలు ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వాచ్ షాప్ రాము, కుమార్‌నాయుడు, డీన్ శ్రీహరి, కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులకు బడి సుధాయాదవ్ అభినందనలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ఎన్‌డిఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రి వర్గంలో శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లు ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పుదిపట్లకు చెందిన రాష్ట్ర ఒబిసి ఫోరం కన్వీనర్ బడి సుధా యాదవ్ సోమవారం ఢిల్లీలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బడి సుధాయాదవ్ మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి వరుసగా మూడోసారి ఎంపీగా గెలిచిన కింజరాపు రామ్మోహన్ నాయుడుకు క్యాబినెట్ పదవి దక్కడం అభినందనీయమన్నారు. గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులుగా సహాయ సహకారాలు అందించాలని బడి సుధా యాదవ్ కోరినట్లు తెలిపారు.


రామ్మోహన్ నాయుడుని అభినందిస్తున్న బడి సుధాయాదవ్

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబి పురం మండలంలోని కాత్రపల్లి, రాజుల కండ్రిగ, గోపాలకృష్ణాపురం, మఠం, రాగిగుంట, మర్రిగుంట ఎస్‌టి కాలనీలో చదువుతున్న విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిపిటి మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్, చంద్రశేఖర్ మాట్లాడుతూ జీరో నుండి 17 సంవత్సరాల లోపు పిల్లలు ప్రతి ఒక్కరూ 13 తేదీ పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని ప్రతి ఆడబిడ్డ చదువుకుంటే ఆ ఇంటికి వెలుగు వస్తుందన్నారు. నేటి బాలలు రేపటి పౌరులు అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నపిల్లలను పనికి పంపించడం, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పిపిటి సిబ్బంది ఈశ్వరయ్య, గంగయ్య పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని ఆరే గ్రామానికి చెందిన ధనుంజయ రెడ్డి రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైసిపి పరాజయం పాలు కావడంతో ప్రభుత్వం మారడంతో ఇక ఎంత మాత్రం డైరెక్టర్ పదవిలో కొనసాగడం సబబు కాదని భావించి సోమవారం రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు పంపానని ఆయన తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో రాజీనామా అంశాన్ని వెల్లడించారు .

పంచాయతీ సమస్యలు పరిష్కరించండి..

ఇవోకి టిడిపి నాయకుల వినతి


పంచాయతీ ఈవోకి వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పాకాల గ్రామ పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని ఈవో మోహికి మండల టిడిపి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకాల పంచాయతీలోని వీధి దీపాలు, మురుగు కాలువలు, రోడ్లు, శుభ్రత, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఈవో దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. స్పందించిన ఈవో మోహి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని పంచాయతీలోని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని మండల టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముక్కంటి ప్రసాదాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ముక్కంటి ఆలయ ప్రసాదాలు అందించారు. అమరావతిలో నీరబ్ కుమార్ ప్రసాద్‌ను బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామి శేష వస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.



బంగారమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయానికి అనుబంధంగా బంగారమ్మ కాలనీలో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి నిర్వహించనున్న జాతర ఏర్పాట్లను సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వి నాగేశ్వరరావు పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ఉద్యోగులను ఆదేశించారు. జాతరకు హాజరయ్యే భక్తుల కోసం వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే నాని దంపతులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డిలు సోమవారం విజయవాడలో నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిశారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 12వ తేదీ ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో విజయవాడ కు చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు నారా భువనేశ్వరిని కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆశీస్సులు అందుకున్నారు.



తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించండి

- కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరులో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశించారు. స్థానిక గాంధీనగర్‌లో ఐదు రోజులుగా పైప్ లైన్లు మరమ్మతులకు గురై తాగునీటి సమస్య నెలకొంది. గతంలో ఏర్పాటు చేసిన బోర్లు సైతం మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గాంధీ నగర్, ప్రశాంతి నగర్‌లలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ తన సిబ్బందితో సోమవారం గాంధీనగర్ కు చేరుకొని మరమ్మతులకు గురైన పైప్ లైన్లు, బోర్లను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట స్థానిక టిడిపి నాయకులు రావూరు సురేంద్ర, ఉదయ్ కుమార్, అంకిరెడ్డి రమేష్ రెడ్డి, బూత్ కన్వీనర్ దానం శ్యాంబాబు, వంశీ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జెవివి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిరుపేద గర్భిణులకు ముఖ్య అతిథి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీనా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు వాకాటి రామమోహన్ సేవలను కొనియాడారు. వారు భవిష్యత్ లో ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేయాలని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ముఖ్యంగా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడుతోందని గూడూరు జనవిజ్ఞాన వేదిక సేవా రంగంలోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గూడూరు జెవివి సభ్యులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని పేర్కొన్నారు. జెవివి కార్యక్రమాలకు [illegible] సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకాటి రామమోహన్, నాగరాజు, సుబ్బారావు, రాధయ్య, ప్రభాకర్, శ్రీనివాసా చారి, కటకం శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.


జెవివి ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

లారీ డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో పుత్తూరు లారీ డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి ఏకాభిప్రాయంతో లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులుగా ఎం ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా వి వేలు, రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా మనోహర్, మోహన్ బాబు, కోశాధికారిగా శివశంకర్ వరప్రసాదన్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సూర్య, అశోక్ , సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎం ప్రశాంత్ మాట్లా డుతూ సభ్యులందరూ కలిసికట్టుగా వుంటే మన సమస్యలు ఏవైనా పరిష్కరించుకోవచ్చ న్నారు. డ్రైవర్లకు ఎలాంటి సమస్యలు వున్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



పుత్తూరు పట్టణ లారీ డ్రైవర్స్‌యూనియన్‌కు ఎన్నికైన నాయకులు

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు టిడిపి రాష్ట్ర సమన్వయ సంయుక్త కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరు టిడిపి కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడు ఔరంగ బాష బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర సమన్వయ సంయుక్త కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ , పట్టణ టిడిపి అధ్యక్షుడు పులిమి గూడూరు మండల టిడిపి అధ్యక్షుడు వెంకటేశ్వర్ల రాజు కేక్ కట్ చేసి బాలకృష్ణ అభిమానులు టిడిపి నాయకులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు , టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు . పట్టణ పరిధిలోని ఓం శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కక్షలు లేని సమాజానికి సహకరించండి :డీఎస్పీ

ప్రజాశక్తి - వి కోట:

ప్రస్తుత మారుతున్న రాజకీయాల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు కక్షలు వీడి చట్టాలను గౌరవించి ప్రతి ఒక్కరూ స్నేహభావంతో ముందు కెళ్లాలని పలమనేరు డిఎస్‌పి విష్ణు రఘువీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. వికోట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సోమవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పలమనేరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రాజకీయ పార్టీల నేతలు కార్యకర్తలు సంయమనం పాటించి కక్షా రాజకీయాలకు పాల్పడకుండా ప్రభుత్వ ప్రైవేట్ ఆస్తులు ధ్వంసం కాకుండా పరిరక్షిం చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఉద్రిక్తతలు లేని సమాజా నికి ప్రతి ఒక్కరు సహకరిం చాలని పిలుపు నిచ్చారు. సవరించిన ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ గుర్తించి వాహ నాలు నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే వారివారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగిన సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ లింగప్ప, ఎస్సై బాబు పాల్గొన్నారు.



‘మత సామరస్యానికి ప్రజలు పట్టం కట్టారు’

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం):

తిరుపతి ప్రజలు మతసామరస్యానికి సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుతో పట్టం కట్టారని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ బాషా అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుపెన్నడూ లేనివిధంగా మసీదుల్లో సైతం రాజకీయ ప్రచారాలు చేసి అపహాస్యం పాలు చేశారన్నారు. ఆరణి శ్రీనివాసులకు మంత్రిపదవి ఇస్తే తగిన గుర్తింపు లభిస్తుందని, తద్వారా తిరుపతి అభివృద్ధి మరింత వేగంగా జరిగే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది ముస్లింలు తెలుగుదేశం పార్టీతో ముస్లింలు లేరని ప్రచారం చేయడం తగదన్నారు. ప్రభుత్వం మారాలని ముస్లిం ప్రజలు, తిరుపతి నగర ప్రజలు తీసుకున్న ఏకనిర్ణయంతో పోలింగ్ రోజున ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారన్నారని అన్నారు. సమావేశం లో రఫీ, షేక్ నూరు ల్లా, అమీర్ ఖాన్, జమాల్ బాయ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

‘బీసీలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి’

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

అధికారం చేపట్టే కూటమి ప్రభుత్వం బీసీలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజ గౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నూతన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల్లో తమ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘంకు తగిన పదవులు కేటాయించి సముచిత స్థానాన్ని ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, మధు ఆచారి, సుబ్రహ్మణ్యం, మహిళా అధ్యక్షురాలు యశోద, మహేష్, మల్లికార్జున్, జగదీష్, మురళి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగరాజ గౌడ్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: నారాయణవనం మండలం కీళగరం పంచాయతీలో ఉపాధి కూలీలతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కౌన్సిలర్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లో 18 సంవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరికీ పొదుపు ఖాతా కలిగి వుండాలని , మన సంపాదించే డబ్బులో 20 శాతం మిగులు డబ్బులను బ్యాంక్ పొదుపు ఖాతాలో దాచుకోవాలని, ఇలా దాచుకున్న డబ్బులను మన అవసరానికి ఎప్పుడైనా తీసుకొనే అవకాశం బ్యాంక్ కల్పిస్తుందని తెలిపారు. ఇవే కాకుండా పలు పథకాల గురించి అవగాహన కల్పించారు. అవి సురక్ష బీమా యోజన కింద ప్రతి ఒక్కరూ వార్షిక ప్రీమియం 20 రూపాయలు చెల్లించి ప్రమాద బీమా చేసుకుంటే 2 లక్షలు ప్రమాద బీమా లభిస్తుందని, జీవన జ్యోతి బీమా యోజన ద్వారా వార్షిక ప్రీమియం 436 రూపాయలు చెల్లించి, 2 లక్షలు రూపాయలు జీవిత బీమా లభిస్తుందని, అటల్ పెన్షన్ యోజన పథకం అతి తక్కువ పెట్టుబడితో వృద్ధాప్యం లో అధిక ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు.



ఉపాధి కూలీలకు ప్రభుత్వ పొదుపు పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

రక్షించేందుకు వెళ్లి దుర్మరణం


రక్షించేందుకు వెళ్లి మృతి చెందిన స్వప్న


కారు ప్రమాదంలో మృతి చెందిన మంగయ్య

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మనిషిగా పుట్టిన వాడికి మానవత్వం ఉండాలని పెద్దలు అంటుంటారు. ప్రమాదంలో ఉన్న ఓ వ్యక్తిని కాపాడపోయి మహిళ దుర్మరణం పాలైన విషాద ఘటన ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సిఐ అజయ్ కిషోర్ కథనం మేరకు..సూరావారిపల్లికి చెందిన మంగయ్య (55) వెంకటగిరి మండలానికి తన సొంత పనిమీద వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వస్తున్న సమయంలో కారు అదుపుతప్పి వాంపల్లి పెట్రోల్ బంకు సమీపంలో డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో వున్న మంగయ్య పరిస్థితి విషమంగా మారింది. అదే సమయానికి అదే మార్గంలో వెంకటగిరి నుంచి తిరుపతికి కారులో వెళుతున్న ఏవి కిరణ్ కుమార్, అతని భార్య కె స్వప్న ప్రమాదాన్ని చూసి మానవత్వంతో కారులో ఉన్న మంగయ్యను రక్షించడానికి ప్రయత్నించారు. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఏర్పేడు మండల పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వాహనం స్వప్నను ఢీ కొంది. దీంతో స్వప్న (42) అక్కడికక్కడే మృతి చెందిందని ఆమె భర్త కిరణ్ కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో కిరణ్ కుమార్ కుడి చేయి విరిగింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు తిరుపతి పట్టణంలో శ్రీవత్సత్ గురుకుల విద్యాలయం నడుపుతున్నట్లు కిరణ్ కుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఎవరిదని శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ అజయ్ కిషోర్‌ను ప్రశ్నించగా ఏర్పేడు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వాహనం అని నడుపుతున్న వ్యక్తి ప్రైవేట్ డ్రైవర్ రాజశేఖర్ అని తెలిపారు. మంగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. స్వప్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- రామచంద్రాపురం: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చంద్రగిరి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. చంద్రగిరి బైపాస్ నాగాలమ్మ జంక్షన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు ప్రహరీ గోడ పక్కన సుమారు 55 సంవత్సరాలు వయస్సు గల ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలం చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి వైద్య కళాశాలకు తరలించారు. మృతుడు తెల్ల చొక్కా, గళ్ల లుంగీ కట్టుకుని వున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు? ఎలా మృతి చెందాడో తెలియడం లేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం రామయ్య తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భాను ప్రకాష్ గెలుపుపై ఎన్‌ఆర్‌ఐల హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజక వర్గం నుంచి 45 వేల ఓట్ల భారీ మెజార్టీతో గాలి భానుప్రకాష్ గెలవడం, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి విజయంపై అమెరికాలోని ప్రవాసాంధ్రులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. గాలి భానుప్రకాష్ గెలుపుతో నగరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు ఆరి నవీన్, కొకటం సురేష్ రెడ్డి, నితిన్, వెంకీ, వంశీ, సాయి, తాతినేని మణిదీప్ పాల్గొన్నారు.

దోమల లార్వాలు లేకుండా చూడాలి


- ఉప మలేరియా అధికారి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ఏ ఒక్కరూ దోమ కాటు ద్వారా సంభవించే డెంగీ, మలేరియా వ్యాధులు బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలుగా దోమల లార్వా మూలాలను గుర్తించి నిర్మూలించాలని సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఉప మలేరియా అధికారి రమేష్ బాబు వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం ఏకొల్లు సచివాలయ పరిధిలోని దొరవారి సత్రంలో చేపట్టిన లార్వా –ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గృహాల్లో నీటి నిల్వలకు ఉపయోగిస్తున్న పాత్రల్లో లార్వాలు ఉత్పత్తి కాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ప్రక్కడ లార్వా మూలాలు లేకుండా కట్టడి చేయాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు. డెంగ్యూ బారిన పడకుండా ముందు జాగ్రత్తగా మనం తీసుకోవాల్సిన అన్ని చర్యలు సకాలంలో నిర్వహించాలన్నారు.ఈ సర్వేలో హెచ్ ఎస్ గోపి కిరణ్,హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, సచివాలయ ఏఎన్ఎం శ్రావణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

కోటేశ్వరయ్య బాధ్యతల స్వీకరణ


ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపడుతున్న జి శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరయ్య సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీనివాసులు రెడ్డి పనిచేస్తూ 2024 మే 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందారు. అదే స్థానంలో కళాశాల సీనియర్ సైకాలజీ అధ్యాపకులు డాక్టర్ జి కోటేశ్వరయ్యని ప్రభుత్వం ప్రిన్సిపల్‌గా నియమిస్తూ కళాశాల కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందాయి. సోమవారం ఆయన ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బోధన బోధనేతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీ అమరావతిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీకాళహస్తిలో ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తున్నట్లు ఆర్డీవో రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆర్డీవో కార్యాలయం కూడా విద్యుత్ దీపాలతో అలంకరణ చేశామన్నారు. శ్రీకాళహస్తి డివిజను పరిధిలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలను అలంకరిస్తారన్నారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం ఎండి పుత్తూరులో మిట్ట ఇండ్లకు సంబంధించి తాగునీటి బోరు ఇటీవల కురిసిన వర్షానికి షార్ట్ సర్క్యూట్స్ కారణంగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ మహాప్రియ వెంటనే మెకానిక్‌ను పిలిపించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నప్పుడు మోటార్లను తగు జాగ్రత్తలతో వాడుకోవాలని ప్రజలను కోరారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత..

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: అంతర్జాతీయ బాలల హక్కుల వ్యతిరేక చట్టం దినోత్సవం సందర్భంగా సోమవారం క్రై సంస్థ బెంగుళూరు వారి పిలుపు మేరకు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని చిందేపల్లి, కుమ్మరి మిట్ట, అంజిమేడు, శివగిరి కాలనీ, చెల్లూరు, గోవిందవరం గ్రామాల పిల్లల వద్ద బొమ్మలు గీయించడం, పిల్లలకు పెద్దలకు బాల కార్మిక వ్యవస్థ పై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో అందరినీ ఆలోచింప చేస్తున్న ముఖ్యమైన అంశం బాల కార్మిక వ్యవస్థ. ఈ బాల కార్మిక వ్యవస్థ వల్ల ఎందరో పిల్లలు చదువుకు దూరమై వారి బాల్యాన్ని కోల్పోయి చిన్న వయసులోనే ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి క్రై సంస్థ, ప్రగతి సంస్థ వారి ద్వారా ప్రజలలో , పిల్లల్లో చైతన్యం తీసుకురావడానికి పిల్లల చేత బాల కార్మిక వ్యవస్థకు సంబంధించి డ్రాయింగ్ వేయించడం, పాటలు, నాటికలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష, సుభాష్ చంద్రయ్య మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత , చదువు ప్రాముఖ్యత గుర్తించకపోవడం లాంటి కారణాలతో చాలా మంది చిన్నారులు చదువుకు దూరం అవుతు న్నా రన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేని పిల్లల్ని తల్లిదండ్రులు కూలి పనులకు తీసుకెళుతున్నారన్నారు. పిల్లల వద్ద పనిచేయించడం నేరమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, చట్టాలు కఠినంగా ఉన్నా అన్ని చోట్లా ఇది అమలు కావడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఏటా జూన్ 12వ తేదీన ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామా లలో అవగాహన కార్యక్రమాలు, గోడ పత్రికల ఆవిష్కరణ, కరపత్రాల పంపిణీ, అవగాహన ర్యాలీలు, ప్రభుత్వ అధికారుల సమన్వయం తో బాల కార్మికులను గుర్తించి వారిని పనుల నుండి విముక్తి చేయడం, తిరిగి చదువును కొనసాగిస్తున్న బాల కార్మిక పిల్లలను గుర్తించి బెంగళూరు వారి సహకారంతో ప్రగతి సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. 18 సంవత్స రాల వయసు లోపు ఉన్న పిల్లలను ఎవ్వరూ పనిలోకి పెట్టు కోకూడదని, అలా ఎవరైనా పిల్లలను పనిలో చేర్చుకుంటే వారిపై బాల కార్మిక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది శిరీష, సుభాష్ చంద్రయ్య, వెంకటయ్య, సురేష్, రాజేశ్వరి, సుమలత అంగన్‌వాడీ టీచర్ భారతి పాల్గొన్నారు.


బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు